క్లుప్తంగా

విరాళం



లింగాలఘణపురం: మండలంలోని కుందారం గ్రామంలో కురుమ సామాజిక వర్గానికి చెందిన వారు నిర్మిస్తున్న బీరప్పగుడికి మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి రూ.50,116 విరాళం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కురుమ పెద్దమనుషులు మాజీ ఎంపీటీసీ చిర్ర నర్సయ్య, సంపత్, కుమార్, రాజు, యాకన్న, యాదగిరి తదితరులు మాజీ జెడ్పీటీసీని మర్యాదపూర్వకంగా కలిసి గుడి నిర్మాణంపై చర్చించగా ఆర్థిక సాయం అందించారు.

సత్కారం



జనగామ: శ్రావణ మాసం పురస్కరించుకుని జిల్లా కేంద్రం గుండ్లగడ్డ ఉమామహేశ్వర దేవాలయ ప్రధాన పూజారి సాంబమూర్తిని శుక్రవారం భక్తులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఉమ, అనురాధ, రాణి, రేణుక, స్వాతి, హైమ, రమ, జ్యోతి, సౌమ్య, వి జయ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

జఫర్‌గఢ్: ఇటీవల మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్‌రెడ్డిని బీజేపీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. నాగేష్‌గౌడ్, పల్లె సంతోష్‌రెడ్డి, కాడబోయిన యువరాజ్, మారపల్లి రవి, కత్తి సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు పెంచాలి

జనగామ రూరల్: రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆసరా పింఛన్లు తక్షణమే పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జూబ్లీ గార్డెన్స్‌లో దివ్యాంగుల, చేయూత పింఛన్ దారుల జిల్లా సన్నాహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కిషోర్, రాజశేఖర్,తాళ్లపెల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జనగామ: కృత్రిమ కాలు కోసం ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామని గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం ద్వారా ఎల్‌ఓసీ మంజూరు చేయించి మాట నిలబెట్టుకోవడం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన రాచమల్లు మహేందర్ కుడి కాలును ప్రమాదంలో తొలగించారు. కృత్రిమ కాలు ఏర్పాటు కోసం ఆర్థికసాయం అందించాలని బాధితులు.. కిరణ్ కుమార్‌గౌడ్‌ను సంప్రదించగా, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.1.25లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం వారికి అందించారు. ఎల్‌ఓసీ అందించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కిరణ్‌కుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.




కృత్రిమ కాలుతో మహేందర్, పక్కన కిరణ్ కుమార్‌గౌడ్

సిమెంట్ బెంచీల బహూకరణ



కొడకండ్ల: మండలకేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ శుక్రవారం 12 సిమెంట్ బెంచీలను బహూకరించారు. గురుకులంలో 630 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా తల్లిదండ్రులు పిల్లల సందర్శనకు వచ్చినపుడు సౌకర్యంగా ఉండేందు కోసం బెంచీలను బహూకరించినట్లు దాత తెలిపారు. గతంలో కూడా గురుకులానికి సౌండ్‌సిస్టం, గ్రీన్‌బోర్డ్స్, బెంచీలు అందించి చేయూతనిచ్చిన రవీందర్‌కు ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

జిరాక్స్ మిషన్..



చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం పూర్వ విద్యార్థులు జిరాక్స్ మిషన్, ప్రింటర్‌ను అందజేశారు. ఆ పాఠశాలలో 1982–83 సంవత్సరంలో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు గజ్జెల దామోదర్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం గుడిమల్ల సంపత్‌కుమార్, ఉపాధ్యాయుల సమక్షంలో వాటిని అందించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. పూర్వవిద్యార్థులు కీర్తి ప్రభాకర్, ఎండీ రబ్బాని, దుబ్బాక శ్రీనివాస్, పాగాల వెంకట్ రెడ్డి, గుంపుల మల్లారెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ, మోడెం స్వామి, మాచర్ల శ్రీనివాస్, అశోక్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలో నర్సరీ సమీపాన వ్యవసాయ భూముల వద్ద విద్యుత్ ఎల్‌టీ లైన్ల తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. వ్యవసాయ భూముల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలు వంగి వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధిత రైతులు తెలుపుతున్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో వ్యవసాయ పనులకు వచ్చే కూలీలు, వరికోత మిషన్లు సైతం రావడం లేదని వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగాక చింతించే కన్నా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా స్పందించాలని, వంగిన విద్యుత్ పోల్‌లు, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



స్తంభాలు వంగి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వం



భూమిపూజలో శివరాజ్ తదితరులు

జనగామ: ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో సొంతింటి కలను సాకారం చేస్తుందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 13, 14, 30 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్ల నరసింగరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు గాదెపాక రాంచందర్, బొట్ల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగల మల్లారెడ్డి, 30వ వార్డు అధ్యక్షుడు మంతపురి ప్రకాష్‌తో కలిసి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. వార్డు అధ్యక్షుడు మిద్దెపాక స్టాలిన్, మహమ్మద్ అజమ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు ఇళ్లు

జనగామ రూరల్: కాంగ్రెస్‌తోనే పేదలకు ఇళ్లు అందుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. వెంకిర్యాలలో ఆయన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి అనుమతి పత్రాలు అందజేశారు. అనంతరం పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

యూరియా కొరత లేదు

లింగాలఘణపురం: జిల్లాలో యూరియా కొరత లేదని, వదంతులు నమ్మొద్దని డీఏఓ అంబికాసోని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కమిషనర్ వీడియా కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడగా మండలంలోని బండ్లగూడెం రైతువేదికలో జరిగిన వీసీలో డీఏఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా విక్రయించే డీలర్లు రైతులకు ఈ–పాస్ మెషిన్‌లతో ఇవ్వాలని, అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. డీఏఓతో పాటు ఏడీ వసంత సుగుణ, ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓలు పాల్గొన్నారు.

8 గంటలలోపే అందుబాటులో ఉంచాలి

ఉదయం 8 గంటలలోపే షాపులు తెరిచి రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బాలునాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పటేల్‌గూడెంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్‌రైతు సేవా కేంద్రాన్ని స్థానిక వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, ఈ–పాస్ విధానంపై రైతులకు వివరించారు. ఈ ఏఈఓ స్పందన తదితరులు ఉన్నారు.

రఘునాథపల్లి: జిల్లా యూరియా కొరత లేదని జేడీఏ బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఫర్టిలైజర్ షాపును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.



వీసీలో పాల్గొన్న డీఏఓ, ఏడీ

రాజవరం కేజీబీవీ సందర్శన


చిల్పూరు: రాజవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కేజీబీవీని శుక్రవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ దూశిపాల సరిత సందర్శించారు. మొదట వంటగదితోపాటు తరగతి గదులను ఆమె పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె పీఆర్ ఏఈ పంతంగి శ్రీనివాస్‌ను పిలిచి విద్యాలయంలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎస్‌ఓ ప్రశాంతి తదితరులు ఉన్నారు.

జిల్లాలో ఐటీడీఏ బ్రాంచ్‌ను నెలకొల్పాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి

జనగామ రూరల్: జిల్లాలో ఐటీడీఏ బ్రాంచ్‌ను నెలకొల్పి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో మాలోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన గిరిజన సమాఖ్య 2వ జిల్లా మహాసభ నిర్వహించారు. సభలో రాజారెడ్డి పాల్గొని మాట్లాడారు. నాయకులు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జువారి రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని విస్నూరు రోడ్డులో మంజీరా దాబా సమీపంలో బండిపెల్లి వాగు బ్రిడ్జి వద్ద శుక్రవారం సాయంత్రం కంకర లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఇంజన్ కల్వర్టులోకి దుసుకెళ్లింది. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన సోమనర్సయ్య పాలకుర్తిలోని క్రషర్‌లో కంకర లోడు చేసుకుని వడ్డెకొత్తపల్లి వెళ్తుండగా బ్రిడ్జి వద్ద ట్రాక్టర్ ఇంజన్ డబ్బా మధ్యలో ఉండే లింకురాడు విరగడంతో ట్రాక్టర్ అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ ట్రాక్టర్ పై నుంచి దూకి ప్రాణాలు కాపడుకున్నాడు. డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై దూలం పవన్ కుమర్ సంఘటన స్థలానికి చేరుకుని వర్షంలో పొక్లెయినర్ సాయంతో ఇంజన్‌ను బయటకు తీశారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



దేవరుప్పుల: సింగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన వంగాల వేణుగోపాల్‌రెడ్డి, సరళరెడ్డి దంపతులు విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఇటీవల తమ మనువడి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు వాటర్‌బాటిళ్లను బహుమతిగా ఇచ్చిన సమయంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం రూ.50వేలతో ఆక్వాఫ్రెష్ మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసి ప్రారంభించామని చెప్పారు.

విద్యార్థి కేంద్రంగా బోధన జరగాలి

జఫర్‌గఢ్: పాఠశాలల్లో విద్యార్థి కేంద్రంగా విద్యాబోధన జరగాలని ఇన్‌చార్జి ఎంఈఓ రఘునందన్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయుల సమావేశం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పద్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

బచ్చన్నపేట: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారుడికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన ముగ్గుపోసి భూమిపూజ చేశారు. అలాగే ఆలింపూర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ మసూద్ భూమిపూజ నిర్వహించారు.

భూమిపూజ

జనగామ రూరల్: వెంకిర్యాల గ్రామంలో ఎమ్మెల్యే కోటా కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను శుక్రవారం బీఆర్ఎస్ మండల నాయకుడు భూరెడ్డి ప్రమోద్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.

మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మహిళలకు కరపత్రం అందిస్తున్న రమేశ్

పాలకుర్తి: మత్స్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ తరాల చంద్రబాబుతో కలిసి జిల్లా మహాసభల కరపత్రాలను చేపల మార్కెట్‌లో మహిళలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు (శనివారం) మూడవ మత్స్యకార్మికుల జిల్లా మహాసభలను స్థానిక ఫంక్షన్ హాల్‌లో జరగనుందన్నారు. ఈ సభకు ముఖ్యనాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మామిండ్ల అయిలమ్మ, సోమలక్ష్మి, ఎల్లమ్మ, లచ్చమ్మ, మత్స్యకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు తేలుకంటి శ్రీనివాస్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, తోటి మండల జర్నలిస్టులు శుక్రవారం ఆయనను పరామర్శించి రూ.21వేల సాయం అందజేశారు. జర్నలిస్టులు, నాయకులు ఉన్నారు.

గుంటి ఫ్యామిలీ..



తరిగొప్పుల: బాధిత కుటుంబానికి అండగా నిలిచారు గుంటి ఫ్యామిలీ కుటుంబసభ్యులు. నర్సాపూర్ గ్రామానికి చెందిన పల్లె మహాలక్ష్మి అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన గుంటి బ్రదర్స్, కుటుంబసభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గుంటి కుటుంబసభ్యులు, పల్లె సంజయ్, యాదగిరి, పల్లె అయోధ్య, జగన్, కమలహాసన్ పాల్గొన్నారు.

నష్కల్‌లో..

చిల్పూరు: నష్కల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న ఎర్రం లక్ష్మి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి సాంబయ్య పరామర్శించి రూ. 3 వేల సాయం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఎరువుల దుకాణాల తనిఖీ

పాలకుర్తి టౌన్: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎరువుల దుకాణాల నిర్వహకులను సీఐ వంగాల జానకీరామ్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏఓ దివ్య, ఎస్సై సృజన్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా యూరియా ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించవద్దని, స్టాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలని, రిజిస్టర్‌లో రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. తనిఖీలో ఏఈఓ సాగర్, దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వన మహోత్సవం

తరిగొప్పుల: మండలకేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.

ఎన్నిక

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన తిప్పరబోయిన కృష్ణ ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాముని రాము, కొంపెల్లి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్ల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు.

నియామకం

పాలకుర్తి టౌన్: జిల్లా ఫొటో గ్రాఫర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజర్‌గా మండల కేంద్రానికి చెందిన రాపోలు లక్ష్మణ్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాముని రాము, కార్యదర్శి కొంపెల్లి భాస్కర్, కోశాధికారి ఉడుగుల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ యూనియన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తాన్నాని తెలిపారు.

జాగ్రత్తగా ఉండాలి

బచ్చన్నపేట: అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ బావుల వద్ద ఇనుప స్టాటర్ డబ్బాలను ముట్టుకోరాదని, ఏమైనా మరమ్మతులు ఉంటే మెకానిక్‌లను సంప్రదించాలని సూచించారు. ఇంటి వద్ద ఇనుప తీగలపై బట్టలను ఆరవేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పరామర్శ

జఫర్‌గఢ్: తిడుగుకు చెందిన బీజేపీ నాయకుడు చంద రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, శుక్రవారం పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

జయప్రదం చేయండి

జనగామ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఏసి రెడ్డి నరసింహారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి వర్ధంతి సభ కరపత్రాలు ఆవిష్కరించారు.

స్థానికంలో సత్తా చాటాలి

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ కొన్నె గ్రామ అధ్యక్షుడు కొప్పురపు సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలి

బచ్చన్నపేట: తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీలకు తప్పకుండా పంపించాలని అంగన్‌వాడీ టీచర్ ఘనపురం కవిత అన్నారు. శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆమె అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలి

- ప్రముఖ రచయిత్రి రమాదేవి



మాట్లాడుతున్న రచయిత్రి రమాదేవి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలని ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవి అన్నారు. మండలంలోని నమిలిగొండ శివారులోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. విద్యార్థినులు స్వతంత్రంగా ఆలోచించి తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని జీవితంలో ఎదగాలని, శ్రమిస్తేనే విజయం సాధిస్తారన్నారు. ఎంఈఓ కొమురయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఘన్‌పూర్ జడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం సంపత్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శృతి పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బోనాలు



బోనాల వేడుకలో విద్యార్థులు

కొడకండ్ల: తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకగా బోనాల వేడుకలు నిలుస్తాయని కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ జ్యోతి అన్నారు. శుక్రవారం పాఠశాలలో సంస్కృతీ, సంప్రదాయాలకనుగుణంగా బోనాల వేడుకలను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పోతరాజు, దేవతల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలువగా వర్షాలు బాగా కురిసి పాడిపంటలు పండాలని, ఈ విద్యా సంవత్సరం ఫలితాల్లో మంచి ర్యాంకులు పాఠశాలకు రావాలని విద్యార్థులు కోరుకున్నారు.

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ శివసాయి స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫతేషాపూర్‌లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి రెండు గ్రామాల ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. సికింద్రాబాద్‌కు చెందిన జాతీయ శ్రవణ, భాషణ దివ్యాంగుల సంస్థ, భారతీయ కృతిమ అవయవాల తయారీ సంస్థ, నాగోల్ సుప్రజ హాస్పిటల్ సౌజన్యంతో వైద్యులు శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమగు వారికి చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, మెడ, నడుం పట్టీలు, చేతి కర్రలు అందజేస్తామని శిబిరం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జగదీష్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామస్తుల ఆరోగ్యం కోసం ఉచిత మెగావైద్య శిబిరం నిర్వహించిన జెట్ట మహేశ్వర్‌ను అభినందించారు. మాజీ సర్పంచ్‌లు ఎండి హయతలి, మహేందర్, భాస్కర్‌రెడ్డి, ఎండీ షబ్బీర్ మియా, వీరోజి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

28న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ రూరల్: ఈనెల 28వ తేదీన జిల్లా స్థాయి జూనియర్, సీనియర్ మెన్, ఉమెన్ జావెలిన్ త్రో అథ్లెటిక్స్ ఎంపికలు జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరుగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు అండర్-8, 10, 12, 14, 16, 18, 20 మెన్, ఉమెన్‌కు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు గంగిశెట్టి మనోజ్ కుమార్, 9885046437, ఆవుల అశోక్, 9912453220, వంచ చంద్రశేఖర్ రెడ్డి, 7799552233 రంజిత్ 9985223047 నంబర్లను సంప్రదించాలన్నారు.

అధికారులకు మానసిక దివ్యాంగుడి అప్పగింత



మానసిక దివ్యాంగుడిని అధికారికి అప్పగిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జనగామ: జనగామ మండలం చౌడారం గురుకులం వద్ద మానసిక స్థితి బాగోలేక మూడు రోజులుగా తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తిని అమ్మఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్‌రాజ్ సహకారంతో శుక్రవారం అధికారులకు అప్పగించారు. గ్రామానికి చెందిన ముక్కా విష్ణు సమాచారం మేరకు అమ్మఫౌండేషన్ సభ్యులు జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ రాజుకు సమాచారం అందించారు. రాజు ఘటన స్థలికి చేరుకుని విచారణ చేపట్టిన అనంతరం ఉన్నతాధికారుల సూచనలను పాటిస్తూ వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

రజకులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న గట్టేశం

బచ్చన్నపేట: రజకులు అన్ని రంగాల్లో రాణించాలని జాతీయ ధోబీ రిజర్వేషన్ సంఘ ఉపాధ్యక్షుడు ఏదునూరి గట్టేశం, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక అన్నారు. శుక్రవారం కేసిరెడ్డిపల్లి గ్రామంలో మండల అధ్యక్షుడు ఆరెళ్ల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠ స్థలాన్ని వారు పరిశీలించారు. రజక సంఘం గ్రామ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జలేందర్, వీరన్న, ప్రధాన కార్యదర్శి యుగేందర్, మహిళా కార్యదర్శి కాసర్ల యాకలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

- పోక్సో కేసులో ఒకరి అరెస్ట్
- ఏసీపీ అంబటి నర్సయ్య

పాలకుర్తి టౌన్: లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తామని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య హెచ్చరించారు. మూడు రోజుల క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన తీగారం గ్రామానికి చెందిన పోగు సోమయ్యపై పోక్సో కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సీఐ వంగాల జానకిరామ్‌రెడ్డి, ఎస్సై దూలం పవన్‌కుమార్.పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



జిల్లా ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న రాజు

జనగామ రూరల్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన అన్‌మ్యాన్డ్ కార్మికుడు బానోత్ రాజు కుటుంబాన్ని ఆదుకుని, మృతికి కారణమైన అధికారులపై చర్య తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఆస్పత్రి వద్ద తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్మెట్ట మండలం మలక్‌పేటకు చెందిన అన్‌మ్యాన్డ్ కార్మికుడు రాజు గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందాడని అన్నారు. ఈ మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. బాధిత కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం, రాజు భార్య నీలకు విద్యుత్‌శాఖలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కమలాకర్, లక్ష్మణ్ ,శ్రీను, వెంకటేష్, ప్రవీణ్, సంపత్, సోమన్న చిన్న శ్రీను, సోమరాజు, భాస్కర్, శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు. కాగా, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు నాయక్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండాగా ఉంటామన్నారు.

వంతెనలు నిర్మించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళింగ రాజు, బీఆర్ఎస్ నాయకులు

జనగామ రూరల్: మండలంలోని గానుగుపహాడ్, చిటకోడూరు వంతెనలు నిర్మించాలని మాజీ ఎంపీపీ మేకల కళింగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన రిలే నిరాహార దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కరుణాకర్, తొట్టె కృష్ణ, కుమార్, సతీష్, పవన్ పాల్గొన్నారు.

మార్కెట్ గోదాంలో పాము కలకలం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ గోదాంలోకి శుక్రవారం సాయంత్రం ఓ నాగుపాము ప్రవేశించగా స్నేక్‌స్పెషలిస్టు చిలుముల రమణాకర్ చాకచక్యంగా పట్టుకుని సమీపంలోని చెట్ల పొదల్లో వదిలేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లోని గోదాంలో రోజూ మాదిరిగానే పనిచేస్తున్న హమాలీ వర్కర్లు గోదాంలో నాగుపామును చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాములను పట్టే రమణాకర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న రమణాకర్ చాకచక్యంగా పామును పట్టుకుని సమీపంలోని చెట్ల పొదల్లో దానిని వదిలాడు.



పట్టుకున్న నాగుపాముతో రమణాకర్